సిద్దిపేట

నమస్తే తెలంగాణ | బుధవారం 2 అక్టోబర్ 2024

WEDNESDAY, OCTOBER 2, 2024

ఎల్ ఆర్ఎస్‌ను వేగవంతం చేయాలి

సిద్దిపేట అర్బన్: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 1 : ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని రంగధాంపల్లిలోని మారుతీనగర్ వెంచర్‌లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ మేరకు మారుతీనగర్ వెంచర్‌లో 175 చదరపు గజాల విస్తీర్ణం గల ఓపెన్ ప్లాట్ లొకేషన్‌తో అప్‌లోడ్ చేసే విధానం గురించి అధికారులు క్లుప్తంగా వివరించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పలు విభాగాలు పూర్తి చేయడానికి సర్వర్ ప్రాబ్లమ్, ఓపెన్ ప్లాట్ ఓనర్ స్పందన లేకపోవడం, ఇతరత్రా ఇబ్బందుల వల్ల ఆలస్యమవుతుందని, లొకేషన్‌లోనే ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తేనే యాప్‌లో అప్‌లోడ్ అవుతుందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 32 వేల ప్లాట్స్ అప్లికేషన్లు ఉన్నాయని, సిబ్బంది కొరత వల్ల ఆలస్యమవుతుందని, మ్యాన్ పవర్ పెంచి వారికి ఎల్ఆర్ఎస్‌పై ట్రైనింగ్ ఇచ్చి ప్రక్రియను వేగవంతం చేయడానికి తనవంతు ఎలాంటి సహకారానికైనా సిద్ధమన్నారు. అధికారులందరూ సమన్వయంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సుడా సీపీవో వందనం, టీపీవోలు నస్రీన్‌భాను, దేవరాజు, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వన్ స్టేట్.. వన్ కార్డు...

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్ 1: వన్ స్టేట్.. వన్ కార్డు కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, డబుల్ బెడ్‌రూమ్, భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, చెరువుల మరమ్మతు పనులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆయా జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ..ఈ నెల మూడో తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, ఒక గ్రామంలోని కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలన్నారు.జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించాలని, ఈ పైలట్ ప్రాజెక్టు ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా మిగతా సర్వేపనులపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగంగా నగర విస్తరణ, విలీనం అవుతు న్న గ్రామాల వివరాలతో నివేదిక రూపొందించి పంపించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన అక్కన్నపేట మండల పంచాయతీ అధికారి కవికుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కలెక్టర్ మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో దేవకీదేవి, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

వర్గరాజ్‌పూర్‌లో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కులు అందజేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, అక్టోబర్1: బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని వర్గరాజ్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వల్లపు రాజు, గొడుగు అంజయ్య కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. మృతులకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బీమా చెక్కులను మంగళవారం ఆ పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యకర్తలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించారన్నారు. నియోజకవర్గంలో 362 మందికి ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున ఏడు కోట్ల24లక్షలను బీఆర్ఎస్ పార్టీ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి,బాల్‌రాజు,నరేశ్, భాస్కర్, సంతోష్‌రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

పొన్నాలలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 1: మండల పరిధిలోని పొన్నాలలో మంగళవారం వ్యవసాయాధికారులు వరి, పత్తి, కంది, ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. వరిలో వచ్చే మొగి పురుగు, పత్తిలో రసం పీల్చే పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వివరించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

చేర్యాలలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వరూప

చేర్యాల, అక్టోబర్ 1: చేర్యాల పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డులో 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేర్యాల సమగ్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్, ఆడెపు నరేందర్, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు కాశెట్టి భాగయ్య, తిరుపతిరెడ్డి, కాలనీ సభ్యులు తుపాకుల బాబు, రాజు, శ్రీధర్, మల్లారెడ్డి, రమేశ్, లత, మమత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి

మహిళలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 1: ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని వల్లంపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సందర్శించి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈవోను సన్మానించిన బీఆర్ఎస్వీ నాయకులు

చేర్యాల, అక్టోబర్ 1: ఇటీవల చేర్యాల మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రచ్చ కిష్టయ్యను మంగళవారం బీఆర్ఎస్వీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ మాట్లాడారు. అంతకుముందు మండలంలోని విద్యాలయాల పరిస్థితి గురించి ఎంఈవోతో బీఆర్ఎస్వీ నాయకులు చర్చించారు. గర్నపల్లి చంద్రం, రాజబాబు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

చేర్యాల, అక్టోబర్1: చేర్యాల మండలంలోని ముస్త్యాల హైస్కూల్‌లో 1991-92వ సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 32 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రకృతిని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలి

గజ్వేల్‌లో మాట్లాడుతున్న నేచర్ క్లబ్ కన్వీనర్ అయోధ్యరెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 1: ప్రతి ఒక్కరూ ప్రకృతిని పరిరక్షించాలని నేచర్ క్లబ్ కన్వీనర్, సిద్దిపేట డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు అయోధ్యరెడ్డి అన్నారు. డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లకు వ్యర్థాల నిర్వహణ సుస్థిర అభివృద్ధిపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కల్నల్ మధుసూదన్‌రావు, సుబేదార్ మేజర్ రామ్‌హరి, మహేందర్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఏఈవోల నిరసన

బెజ్జంకి, అక్టోబర్ 1: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేతో అవస్థలు పడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ఐకాస పిలుపు మేరకు మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం ఏఈవోలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన సర్వేకు సహాయకులు అవసరమవుతారని, కానీ వారిని నియమించకుండా ఒక ఏఈవో క్లస్టర్ పూర్తిస్థాయి పంటలను నమోదు చేయడం సాధ్యంకాదన్నారు. ఏఈవోలు శ్వేత, రేణుక, మౌనిక, రచన, విజయ్, భరత్‌కుమార్ ఉన్నారు.

నేటి నుంచి కాళీమాత శరన్నవరాత్రి ఉత్సవాలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 1: మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ కాళీమాతాశ్రమంలో పరమయోగిని కాళీమాత(తల్లి) ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు కాళీమాత శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు, న్యాయవాది గుర్రం నారాయణ తెలిపారు. తొమ్మిది రోజులు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. రోజూ అభిషేకాలు, అర్చనలు, హోమాలు,చివరి రోజు కాళీమాత అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చేర్యాలలో రాస్తారోకో చేస్తున్న కురుమ సంఘం నాయకులు

చేర్యాల, అక్టోబర్ 1: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో కురుమ సామాజిక వర్గానికి చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కురుమ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నరసింహ మాట్లాడుతూ బాలికపై లైంగికదాడి జరగడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు అందె బీరయ్య, జయ మల్లేశం, మీస పార్వతీసత్యనారాయణ, ఒరుగంటి శంకర్‌గౌడ రాజ్‌కుమార్, అందె నాని, ఒగ్గు మల్లేశం, అందె అశోక్, జంగిలి యాదగిరి, బైకని కమలాకర్, కామల్ల అనిల్‌కుమార్, ఈరి భూమయ్య, బండారి సతీశ్, దయ్యాల రాజు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంబురాలు

కేక్ కట్ చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

సిద్దిపేట,అక్టోబర్ 1: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సిద్దిపేట బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆ సంస్థ ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ ఇంజినీర్లు రవీందర్, మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగులు రాజ్‌కుమార్, శ్రీకాంత్, మత్తయ్య, లింగం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గజ్వేల్, అక్టోబర్ 1: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా ముగిసింది. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ శిబిరంలో 64మందికి వైద్య పరీక్షలు చేసిన అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నరేశ్‌బాబు, పద్మజ్యోతి, మంజుల, సాయినాథ్‌రెడ్డి, చందర్, మహిపాల్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నరేశ్‌బాబు

సమస్యల పరిష్కారానికి కృషి: ఆర్డీవో

గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

వర్గల్, అక్టోబర్1: భూనిర్వాసితుల సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తానని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. మంగళవారం భూనిర్వాసితులు చేస్తున్న ఆందోళన శిబిరాన్ని ఏసీపీ పురుషోత్తంరెడ్డి, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీజీఐఐసీలో భాగంగా భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలందరికీ వారం రోజుల్లో ఇండ్ల స్థలాల పట్టాలతోపాటు ప్లాట్ల పొజిషన్లు కేటాయిస్తామన్నారు. తహసీల్దార్ బాల్‌రాజ్,ఎస్సై కరుణాకర్‌రెడ్డి, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

తీగుల్‌లో వరిపొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాధిక

జగదేవపూర్, అక్టోబర్1: వేరు శనగ పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై హైదరాబాద్ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ రాంరెడ్డి దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని తీగుల్ గ్రామ రైతు వేదికలో రైతులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాధిక, మండల వ్యవసాయాధికారి వసంతరావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆమె రైతులతో కలిసి వరిపొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు శరణ్య, సమత, భానుప్రకాశ్, ఖలీల్, కృష్ణమూర్తి, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేత

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 1 : కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 100 మంది విద్యార్థులకు మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ పులోజి కిరణ్‌కుమార్‌చారి స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

చేర్యాల, అక్టోబర్ 1: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 30న హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో చేర్యాల ప్రాంతంలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మెదక్ జిల్లా అండర్-17 హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లా కోస్గిలో బుధవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ జట్టు తరపున ఆడనున్నారు. హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను ఎంఈవో రచ్చ కిష్టయ్య ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

గాంధీ, శాస్త్రి జయంతిలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్1: అర్జున్‌పట్ల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నందు, విష్ణు, అక్షిత గాంధీ, శాస్త్రి వేషధారణలతో స్వాతంత్ర్య పోరాట సంఘటనలు నాటిక రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా సంధ్య, రామచంద్రమూర్తి వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం అశోక్, యశోద, సుదర్శన్‌రెడ్డి, గంగప్రసాద్, కులకర్ణి, సరిత, రజిత పాల్గొన్నారు.

పూల సింగిడి

- అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు
- బతుకమ్మలను పేర్చి ఆడిపాడిన విద్యార్థినులు, మహిళలు

చేర్యాల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హుస్నాబాద్: కేరళ స్కూల్‌లో..

సిద్దిపేట: బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, మాజీ జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ

దుబ్బాక: కస్తూర్బాలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

అక్కన్నపేట: కేశవాపూర్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మంగళవారం ప్రభుత్వం కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులు, మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చారు. మహిళలు బతుకమ్మపాటలు పాడుతూ ఆడిపాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ మహిళలకు బతుకమ్మ పండుగ చాలా ప్రత్యేకమైనదన్నారు. ఆడపడుచులందరూ తొమ్మిది రోజుల పాటు పండుగ జరుపుకుంటారన్నారు.

-సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, అక్టోబర్1

గజ్వేల్: సింగాటంలో బతుకమ్మ సంబురాలు

కోహెడ: కోహెడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కొండపాక(కుకునూరుపల్లి): దమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

మద్దూరు(ధూళిమిట్ట): అర్జున్‌పట్ల హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

జగదేవపూర్: మాస్టర్‌మైండ్స్ పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో మాధవరెడ్డి

ఎస్‌జీటీయూ మండల కమిటీ ఎన్నిక

అక్కన్నపేట, అక్టోబర్ 1: మండల సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ (ఎస్‌జీటీయూ)నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ధరావత్ మొగిలి (యూపీఎస్ చౌటపల్లి), ప్రధాన కార్యదర్శిగా గజవెల్లి శ్రీనివాస్(పీఎస్ గౌరవెల్లి), కోశాధికారిగా భూక్యా తిరుపతి(పీఎస్ గోవర్ధనగిరి), ముఖ్య సలహాదారుడిగా ఆసర్ల మల్లయ్య(పీఎస్ తెనుగుపల్లి)తో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, మహిళా కార్యదర్శిని ఎన్నుకున్నారు.

ఎంఈవోకు సన్మానం

అక్కన్నపేట, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఎంఈవో రంగనాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు గుగులోతు తిరుపతినాయక్ మాట్లాడారు. గిరిజన నాయకులు లావుడ్య కిషన్ నాయక్, భూక్యా తిరుపతి నాయక్, రైనానాయక్, భూక్యా సుధాకర్‌నాయక్, సంతోష్, చౌహన్, తిరుపతినాయక్, మల్లేశం నాయక్ పాల్గొన్నారు.

కూరెల్ల గౌడ సంఘం అధ్యక్షుడిగా శంకర్

కోహెడ అక్టోబర్ 1: మండలంలో కూరెల్ల గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా జాగిరి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సర్వసభ్యసమావేశంలో ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా పొన్నం శ్రీనివాస్ ఎన్నికయ్యాడు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

కొమురవెల్లి, అక్టోబర్ 1 : మండల కేంద్రానికి చెందిన పోతుగంటి భిక్షపతికి రూ.25,500, మండలంలోని పోసాన్‌పల్లికి చెందిన కొమ్ము ఐలయ్యకు రూ.51వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఏర్పుల మహేశ్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎక్కల దేవి నాగరాజు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని ఒకరి మృతి

వర్గల్, అక్టోబర్1: బొలెరో వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు.గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...ములుగు మండలం బైలంపూర్ గ్రామానికి చెందిన పూసల కృష్ణ మంగళవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో టీవీఎస్‌పై వెళ్తుండగా వర్గల్ మండలం గిర్మాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం కృష్ణ టీవీఎస్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కృష్ణకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

కుక్కలు,కోతుల బాధ నుంచి కాపాడండి

కోహెడ , అక్టోబర్ 1: మండల కేంద్రంలో మంగళవారం గ్రామ సభ జరిగింది. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువకులు కోతులు, కుక్కలతో ఇబ్బంది పడుతున్నామని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ సురేఖ మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవేందర్, వివిధ పార్టీల నాయకులు ఖమ్మం వెంకటేశం, లక్ష్మణ్, చంద్రారెడ్డి, వేల్పుల వెంకటస్వామి, గుగ్గిళ్ల శ్రీనివాస్, శివకుమార్, కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

వట్టిపల్లి స్కూల్ సందర్శన

జగదేవపూర్, అక్టోబర్1: మండలంలోని వట్టిపల్లి ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి మాధవరెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మొట్టమొదటిసారిగా పాఠశాలకు వచ్చిన ఎంఈవోను స్థానిక నాయకులు రాంరెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరోజ, కనకయ్య, బాలరాజు, విజయభాస్కర్‌రెడ్డి, మల్లయ్య, శారద,పరుశురాములు, రంజిత్ పాల్గొన్నారు.